ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 73 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 23 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్





## నీట్-పీజీ పరీక్ష వాయిదా

### త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తాం
### కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటన
### పరీక్షకు ముందు రోజు నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 22 (ప్రభాత ఉదయం): నీట్-యూజీ, యూజీసీ-నెట్ పరీక్షల వివాదం నేపథ్యంలో నీట్-పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసింది. ఆదివారం పరీక్ష జరగాల్సి ఉండగా శనివారం రాత్రి ఈ మేరకు ప్రకటన చేసింది. పలు పోటీ పరీక్షల సమగ్రతపై ఇటీవలి ఆరోపణల నేపథ్యంలో నీట్-పీజీ పరీక్ష ప్రక్రియ పటిష్టతను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ..మిగతా 2లో

## ముగిసిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

### వీటిపై పన్ను మినహాయింపు



న్యూఢిల్లీ, జూన్ 22 (ప్రభాత ఉదయం): వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) కౌన్సిల్ 53వ సమావేశం శనివారం ముగిసింది. ఈ సమావేశం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను తెలియజేసి కీలక నిర్ణయాలను వెల్లడించారు. సోలార్ కుక్కర్లపై 12 శాతం జీఎస్టీ విధించేందుకు ఆమోదం తెలిపామన్నారు. దేశంలో బయోమెట్రిక్ ప్రామాణీకరణ అమలులో ఉండగా , GST చట్టంలోని సెక్షన్ 73 కింద జారీ చేయబడిన డిమాండ్ నోటీసులకు వడ్డీ, పెనాల్టీని మాఫీ చేయాలని సిఫార్సు చేయబడింది. ఇది కాకుండా, నకిలీ ఇన్‌వాయిస్‌లను అరికట్టడానికి దశలవారీగా దేశవ్యాప్తంగా బయోమెట్రిక్ ప్రామాణీకరణ అమలు చేయబడుతుంది. పరిమిత అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకో వచ్చని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బడ్జెట్ సెషన్ తర్వాత మరో జీఎస్టీ సమావేశం జరగనుంది. వ్యాపార ..మిగతా 2లో

## శ్రీవారి ప్రత్యేక దర్శనం, లడ్డూ ధరలు యధాతథం

### వాటిలో ఎలాంటి మార్పూ లేదని టిటిడి వివరణ
### సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో వాస్తవం లేదని వెల్లడి



తిరుమల,జూన్ 22 (ప్రభాత ఉదయం):ా శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూ ధరలను సవరించినట్లు పలు సామాజిక మాధ్యమాల్లో జరుగుతన్న ప్రచారంలో నిజం లేదని టిటిడి తెలిపింది. ఇవి నమ్మదగినివి కాదని పేర్కొంది. దీనిపై తిరుమల తిరుపతి దేవస్థానం టీడీపీ స్పష్టత ఇచ్చింది. పలు సామాజిక మాధ్యమాలలో శ్రీవారి లడ్డు ధరలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం ధరల్లో మార్పులు చేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని టీటీడీ స్పష్టంచేసింది. శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, రూ. 50 లడ్డూ ప్రసాదం ధరల్లో ఎటువంటి మార్పు లేదని టీటీడీ స్పష్టం చేసింది. దీనిని 200కు లడ్డూ ధరను 20కి మార్చినట్లు జరుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొంది. ఈ విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని టీటీడీ శనివారంనాడు విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో కోరింది. కొన్ని ..మిగతా 2లో

## హెల్త్ టూరిజం హబ్‌గా తెలంగాణ

శంషాబాద్ సమీపంలో సకల వసతులతో మెడికల్ హబ్
బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సేవలకు ప్రశంసలు
24వ వార్షికోత్సవంలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, జూన్ 22 (ప్రభాత ఉదయం): తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇక్కడ అత్యంత అధునాతన ఆస్పత్రులు ఉన్నాయని, వాటిని కనెక్ట్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం మెడికల్ టూరిజం ప్రతిపాదన ఉందన్నారు. సీఎం హోదాలో తాను నిత్యం 18 గంటలు పనిచేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ 24వ వార్షికోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆలోచనను కుటుంబ సభ్యులు కార్యరూపంలో పెట్టారని చెప్పారు. క్యాన్సర్ ను అరికట్టాలనేది గొప్ప ఆలోచన అని అన్నారు. భవిష్యత్ లోనూ బసవతారకంకు తోడుంటామని చెప్పారు. ఆస్పత్రి విస్తరణకు సహకరిస్తామని చెప్పారు. నిత్యం ఎంతో మందికి ఆస్పత్రి సేవలందిస్తుందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు పక్కన భూమి తీసుకుని మెడికల్ హబ్‌గా పెద్ద ఆస్పత్రులు కట్టిస్తామని తెలిపారు. హైదరాబాద్ కు వస్తే జబ్బు నయమౌతుందనేలా చేస్తామని అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు పోటి ..మిగతా 2లో




## పేపర్ లీకేజీలకు ఇక కఠిన చర్యలు

### 5 నుంచి పదేళ్ల జైలు.. కోటి వరకు జరిమానా
### అమల్లోకి వచ్చిన ప్రివెన్షన్ యాక్ట్

న్యూఢిల్లీ, జూన్ 22 (ప్రభాత ఉదయం): దేశంలో వరుస పేపర్ లీకులతో సతమవుతున్న కేంద్రం ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ మొదలుపెట్టింది. పేపరు లీకేజీలకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకుగాను యుద్ధప్రాతిపదికన ’ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్)యాక్ట్-2024ను అమల్లోకి తీసుకొచ్చింది. ఇది జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి న్యాయశాఖ నిబంధనలు రూపొందిస్తోందని, త్వరలో నోటిఫై చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందప్రధాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోపే ..మిగతా 2లో



## బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు మంజూరు

### తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆషాడ బోనాల నిర్వహణ
### దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి

హైదరాబాద్, జూన్ 22 (ప్రభాత ఉదయం): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆషాడ బోనాల ఉత్సవాలు సాగాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ యేడాది బోనాల నిర్వహణకు సీఎం రేవంత్ రెడ్డి రూ. 20 కోట్లను మంజూరు చేశారని మంత్రి సురేఖ ప్రకటించారు. బోనాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో జిహెచ్‌ఎంసి పరిధిలోని దేవాదాయ శాఖ కమిషనర్లతో మంత్రి సురేఖ నేడు సెక్రటేరియట్ లోని తన కార్యాలయంలో సమీక్షను చేపట్టారు. బోనాల ఉత్సవ ఏర్పాట్లు, బడ్జెట్ కేటాయింపు తదితర అంశాల పై మంత్రి సురేఖ ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్లు కృష్ణవేణి, బాలాజీ, సంధ్యారాణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరిలోని ప్రధాన దేవాలయాలతో పాటు ఇతర దేవాలయాల్లో బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేశారని ప్రకటించారు. దేవాలయాల ..మిగతా 2లో

## ఉద్యోగాలపై కేబినేట్‌లో ఎందుకు చర్చించలేదు

### నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోరా
### సిఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



హైదరాబాద్, జూన్ 22 (ప్రభాత ఉదయం): గ్రూప్స్ అభ్యర్థుల, నిరుద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులకు క్యాబినెట్ సమావేశంలో న్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకుంటుంటారని ఎదురుచూశామని అన్నారు. గ్రూప్ అభ్యర్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యల గురించి ..మిగతా 2లో



## సింగరేణికి అండగా ఉంటా

### అనవసరంగా విమర్శలు చేస్తే సహించం
### సింగరేణిని మభ్య పెట్టి లబ్ది పొందిన బిఆర్ఎస్
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జూన్ 22 (ప్రభాత ఉదయం): కేంద్రమంత్రిగా సింగరేణికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో ..మిగతా 2లో

## తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీస్తున్న ప్రభుత్వం



### బొగ్గు గనుల వేలంలో పాల్గొనడమే నిదర్శనం
### కాంగ్రెస్, బిజెపిలు తోడు దొంగలన్న కెటిఆర్

హైదరాబాద్, జూన్ 22 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్, బిజెపిలు తోడుదొంగలని, సీఎం రేవంత్ రెడ్డిపై, ఆయన చెబుతున్న అబద్దాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి గద్దెపై రేవంత్ ఎక్కిన తర్వాత కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెడుతున్న తీరు ప్రతి ఒక్క తెలంగాణ పౌరుడు గమనిస్తున్నారని చెప్పారు. రేవంత్, ఆయన ప్రభుత్వం చేస్తున్న అబద్దాల ప్రచారం చూసి జోసెఫ్ గోబెల్స్ కూడా తన సమాధిలోనే తలదించుకుంటున్నారని ..మిగతా 2లో

# హెల్త్ టూరిజం హబ్‌గా తెలంగాణ

**మొదటి పేజీ తరువాయి...**




పడుతాయని తెలిపారు. 24వ వార్షికోత్సవానికి బాలకృష్ణ ఆహ్వానించారని 30 వ వార్షికోత్సవానికి కూడా తానే వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బసవతారకం ఆసుపత్రి లక్షలాది మందికి సేవలందిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిస్వార్థంగా పేదలకు సేవలందించేందుకు ఆసుపత్రిని నిర్మించారని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబుతో అభివృద్ధిలో పోటీపడే అవకాశం నాకు వచ్చింది. ఆయన 18 గంటలు పనిచేసి.. నేను 12 గంటలు పని చేస్తే సరిపోదు. తెలంగాణ రాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందే. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడాలి.. ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని చూస్తున్నాం అని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలిపారు. అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు హెల్త్ టూరిజం హబ్ ఉంటుందన్నారు. అందులో బసవతారకం ఆసుపత్రికి తప్పకుండా స్థానం ఉంటుంది. వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచంలోని ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ ఆలోచనలో ఏర్పాటైన ఈ ఆసుపత్రి 24 ఏళ్లుగా కోట్లాది మందికి సేవ చేయడం ఆనందదాయకమని రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించేందుకు చంద్రబాబు నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. నిరుపేదలకు వైద్యసేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేయడం చూసి స్వర్గం నుంచి మనల్ని ఆశీర్వదిస్తానన్నారు. నిరుపేదలకు క్యాన్సర్ వ్యాధిని నయం చేసేందుకు వైద్యరంగంలో విశేష కృషి చేసిన ఎన్టీఆర్ బసవతారం ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సహకారం అందించాలన్నా మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆసుపత్రి ఛైర్మన్ బాలకృష్ణ హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీపడే అవకాశం వచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలన్నారు. ఎన్టీఆర్‌కు రాజకీయాలు, సంక్షేమం వారసత్వంగా వచ్చాయి.రెండు కిలోల బియ్యంతో బసవతారకం ఆస్పత్రిని నిర్మించి పేదలకు అండగా నిలిచారని ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ మొదటి తరం అయితే, రెండో తరం చంద్రబాబు, బాలకృష్ణ అని, మూడో తరం లోకేష్, భరత్ అని రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ మూడో తరం కూడా దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తు న్నట్లు తెలిపారు. నందమూరి తారక రామారావు భార్య, బాలకృష్ణ తల్లి బసవతారకం క్యాన్సర్‌తో మరణించారు. ఆ సమయంలో క్యాన్సర్ చికిత్స అందుబాటులో లేదు. దీంతో కేన్సర్ బారిన పడిన పేదలు వైద్యం చేయించుకోలేకపోతున్నారు. అందుకే పేదలకు వైద్య సహాయం అందించేందుకు ఎన్టీఆర్ ఈ బసవతారకం ఆసుపత్రిని ప్రారంభించారు. డొనేషన్‌తో నడిచే ఈ ఆసుపత్రిలో పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందుతుంది. అందుకే అన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్యాన్సర్ రోగులు వచ్చి చికిత్స పొందుతున్నారు. క్యాన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోందని బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆసుపత్రి సేవల విస్తరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి సహకారం కోరగానే అంగీకరించారని చెప్పారు. దాతల సహకారంతో ఆసుపత్రి ఈ స్థాయికి చేరుకుందని తెలిపారు. సేవలను మరింత విస్తరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, డా.నోరి దత్తాత్రేయుడు పాల్గొన్నారు.



## శ్రీవారి ప్రత్యేక దర్శనం, లడ్డూ ధరలు యధాతథం

**మొదటి పేజీ తరువాయి...**

వాట్సప్ గ్రూపులలో తిరుమల దర్శనానికి సంబంధించి అధిక ధరలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొంద వచ్చునని కొంతమంది వారి ఫోన్ నంబర్లతో కూడిన సమాచారం సర్కులేట్ అవుతుండటం తమ దృష్టికి వచ్చినట్లు టీటీడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. వాస్తవానికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించి టీటీడీ వెబ్‌సైట్ ద్వారానే కాకుండా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన టూరిజం విభాగాలకు కొంత టికెట్ల కేటాయింపు జరిగినట్లు తెలిపింది. భక్తులు ఎవరైనా సంబంధిత టూరిజం ద్వారా ఈ టిక్కెట్లను పొందే సౌకర్యం ఉన్నదని వివరించింది. టూరిజం ద్వారా రావాలి అనుకొనే భక్తులు, దళారీల ద్వారా కాకుండా, నేరుగా, రాష్ట్ర టూరిజం వెబ్‌సైట్ ద్వారా కూడా దర్శనం ప్యాకేజీ టికెట్స్ పొందే అవకాశం ఉందని గమనించాలని కోరింది. అయితే కొందరు దళారులు అమాయకులను తాము సదరు టూరిజం వెబ్సైట్ ద్వారా మీకు టిక్కెట్లు బుక్ చేసి ఇస్తామని ఇందుకుగాను ధర ఎక్కువ అవుతుందని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు టీటీడీ తెలిపింది. అలాంటి ప్రచారాన్ని భక్తులు నమ్మొద్దని.. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోసం దళారులను సంప్రదించొద్దని కోరింది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల బుకింగ్ లో అమాయకులైన భక్తులను మోసగిస్తున్న దళారులపై టిటిడి విజిలెన్స్ విభాగము కఠిన చర్యలు తీసుకుంటుందని టీటీడీ హెచ్చరించింది. ఈ విషయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని.. దళారుల మాటి నమ్మి మోసపోవద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది.



## సింగరేణికి అండగా ఉంటా

**మొదటి పేజీ తరువాయి...**

మాట్లాడారు. 'సింగరేణి కార్మికులకు అన్ని రకాలుగా అండగా ఉంటానని అన్నారు.న సింగరేణిని రక్షించాల్సిన బాధ్యత 49 శాతం వాటా ఉన్న కేంద్రంపై కూడా ఉంది. ఆ సంస్థకు లాభం చేకూర్చే పని కేసీఆర్, కేటీఆర్, భారాస ప్రభుత్వం ఏనాడూ చేయలేదన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు సొంత ఇంటి పథకం అంటూ మభ్యపెట్టారు. వైద్య సదుపాయం, కాంట్రాక్ట్ కార్మికుల రైగ్యులరైజ్, కోల్ ఇండియా కార్మికుల తరహా జీతాలు వంటి హామీలన్నీ తుంగలో తొక్కారు. తెలంగాణ బిడ్డగా సింగరేణి ప్రయోజనాలే నాకు ముఖ్యం. వేర్వేరు రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం ఉన్నా సరే సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని అన్నారు. రానున్న రోజుల్లో మనం కూడా ఆత్మనిర్భర్‌ను స్ఫూర్తిగా తీసుకొని సొంత కాళ్లపై నిలబడాలి. దేశంలో బొగ్గు ఉత్పత్తి మరింత పెరగాల్సి ఉంది. ఆ దిశగా నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. అభివృద్ధికి అడ్డుపడొద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నా. త్వరలోనే సింగరేణికి సంబంధించిన అన్ని అంశాలపై సమీక్ష నిర్వహిస్తా. కోల్ ఇండియా కూడా వేలంలో పాల్గొంటోంది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం చట్టం చేశాం. రాష్ట్రంలోని బొగ్గు గనులకు వేలం వేసుకోవాలని కేంద్రం ఎన్నోసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రూ.2వేల కోట్ల ఆదాయం కోల్పోయాం. చట్టంతో మాకేం సంబంధం అని ఇవాళ భారాస నేతలు మాట్లాడుతున్నారు. చట్టం చేసిన సమయంలో వారు సభలోనే ఉన్నారు. దానికి మద్దతు ప్రకటించారు. సింగరేణి విషయంలో ప్రశ్నిస్తున్న నేతలు మైన్స్ వేలంలో ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పాలి. ఐరన్ వోర్, సున్నపురాయి గనులకు వేలం వేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఓడిపోయామనే బాధలో కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలపై జాలి చూపించాలి' అని కిషన్‌రెడ్డి అన్నారు.

## ఉద్యోగాలపై కేబినేట్‌లో ఎందుకు చర్చించలేదు

**మొదటి పేజీ తరువాయి...**

ఎలాంటి చర్చ లేకుండా క్యాబినెట్ సమావేశం ముగించారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి మరిచారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఇస్తామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పటికే ఆరు నెలలు దాటిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలను ఇచ్చారు తప్ప కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మిమ్మల్ని నమ్మి అధికారంలోకి తీసుకొచ్చిన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం రోడ్డున పడి అర్తనాదాలు చేయాల్సిన పరిస్థితికి తెచ్చారని చెప్పారు. గ్రూప్ 1, డిఎస్సీ తదితర ఉద్యోగాల కోసం చేపట్టిన నియామక ప్రక్రియ కూడా ఉద్యోగార్థులకు చాలా ఇబ్బంది కరంగా మారిందన్నారు. కనీసం వారు చేస్తున్న విజ్ఞప్తిని వినే పరిస్థితిలో కూడా ప్రభుత్వం లేకపోవడం శోచనీయమన్నారు. మెయిన్స్‌కు 1 : 50 నిష్పత్తిలో కాకుండా, 1 : 100 నిష్పత్తిలో అభ్యర్థులను అనుమతించాలని కోరారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్ 2 నోటిఫికేషన్‌లో 1:15 గా పేర్కొన్నప్పటికీ, అభ్యర్థుల కోరిక మేరకు 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేశారని గుర్తుచేశారు. గ్రూప్ 2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3కి మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలుపుతామని రేవంత్ మాట ఇచ్చారని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండడం వల్ల అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఉద్యోగ నియామకాల పరీక్షల తేదీల మధ్య ఎక్కువ వ్యవధి ఉండేలా షెడ్యూల్ సవరించాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

## నీట్-పీజీ పరీక వాయిదా

**మొదటి పేజీ తరువాయి...**




నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొన్నది. కొత్త తేదీని వీలైనంత త్వరగా ప్రకటిస్తామని వెల్లడించింది. విద్యార్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్టు పేర్కొన్నది. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, పరీక్ష ప్రక్రియ పవిత్రతను కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. కాగా, నీట్-యూజీ పరీక్షలో పేపర్ లీక్ అయ్యిందని, అక్రమాలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ వివాదం కొనసాగుతుండగానే నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడంతో పరీక్షను రద్దు చేశారు.



## బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు మంజూరు

**మొదటి పేజీ తరువాయి...**

అలంకరణ,పట్టు వస్త్రాలు కొనుగోలు, బోనాల సమాచారాన్ని తెలిపే పుస్తకాల ముద్రణ, అంబారీ నిమిత్తం ఏనుగు సేవల వినియోగం, విద్యుత్, సాంస్కృతిక, సమాచార ప్రజాసంబంధాల శాఖ ప్రచారం తదితర ఖర్చుల కోసం ఈ మొత్తాన్ని వినియోగించనున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఈ యేడాది బోనాల నిర్వహణ నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛైర్మన్ గా రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. దేవాదాయ శాఖ మంత్రి అయిన తాను, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, రాజ్యసభ ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యులుగా, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి సభ్యులు/కన్వీనర్ గా మొత్తంగా ఏడుగురితో కూడిన కమిటి బోనాల ఉత్సవ నిర్వహణా బాధ్యతలను చేపడుతుందని మంత్రి సురేఖ తెలిపారు. ఇతర ప్రధాన దేవాలయాలకు ఉత్సవ కమిటీల ఎంపిక ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తవుతుందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టను చాటేలా బోనాలను నిర్వహించాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. జోగినీల బోనాల సమర్పణ సమయంలో ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, వారికి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తవహించాలని అన్నారు. బోనాల ఉత్సవాలను ప్రదర్శించేలా హోర్డింగ్ లు, ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, బోనాల ఉత్సవాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రసారమాధ్యమమైన డిడి యాదగిరి ఛానల్ లో లైవ్ ప్రసారాలు సాగేటట్లు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏనుగు తరలింపు పై ఆరా తీశారు. ఢిల్లీ కేంద్రంగా తెలంగాణ భవన్ లో తెలంగాణ ఖ్యాతి ఇనుమడించేలా ఉత్సవాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పనుల నిమిత్తం అవసరమయ్యే నిధుల కేటాయింపు పై మంత్రి అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలే కేంద్రంగా ఈ యేడాది బోనాలను నిర్వహిస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.



## ముగిసిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

**మొదటి పేజీ తరువాయి...**

సౌకర్యాలు, పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు రూ. 20 లక్షల ద్రవ్య పరిమితిని సిఫార్సు చేశారు. చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం GSTR-4 గడువు, FY 24-25, జూన్ 30 వరకు పొడిగించబడింది. నకిలీ ఇన్‌వాయిస్‌లను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా దశలవారీగా బయోమెట్రిక్ ప్రమాణీకరణను అమలు చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇది కాకుండా మార్చి 31, 2025లోపు పన్ను చెల్లిస్తే 2017-18, 2018-19, 2019-20కి సంబంధించిన డిమాండ్ నోటీసులపై వడ్డీ, జరిమానా మినహాయించబడుతుందని ఆమె చెప్పారు. దీంతో పాటు ఇతర ఎజెండాలపై చర్చించేందుకు వచ్చే ఆగస్టులో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

### కౌన్సిల్ ప్రధాన నిర్ణయాలు..

"సింగిల్ లేదా డ్యూయల్ ఎనర్జీ సోర్స్ ఉన్నా అన్ని సోలార్ కుక్కర్లపై 12% %+టు%ని కౌన్సిల్ సిఫార్సు చేసింది. భారతీయ రైల్వే సామాన్యులకు అందించే సేవలు, ప్లాట్‌ఫారమ్ టిక్కెట్ల విక్రయం, రిటైరింగ్ రూమ్‌లు, వెయిటింగ్ రూమ్‌లు, క్లోక్‌రూమ్ సేవలు, బ్యాటరీతో నడిచే కార్ల సేవలను జీఎస్టీ నుంచి మినహాయిస్తున్నారు. విద్యా సంస్థల వెలుపలి విద్యార్థుల హాస్టళ్లకు కూడా మినహాయింపు ఇస్తున్నారు. వసతి సేవల సరఫరా విలువ ప్రతి వ్యక్తికి నెలకు రూ. 20,000 వరకు ఉంటుంది. ఈ సేవలు కనీసం 90 రోజుల పాటు నిరంతరాయంగా అందించబడతాయి."



### తెలంగాణ ప్రయోజనాలు

## దెబ్బతీస్తున్న ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి...**

ఎద్దేవా చేశారు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకొని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్న పార్టీ తమదన్నారు. మరోవైపు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వినకుండా వాటిని క్రూరంగా అణిచి, వేల మందిని చంపిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తమ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనుల అమ్మకాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకించిందన్నారు. అందుకే ప్రభుత్వం ఏ రోజూ వేలంలో పాల్గొనలేదని చెప్పారు. కానీ నేడు కాంగ్రెస్ పార్టీ నిస్సిగ్గుగా వేలంలో పాల్గొని తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ కొడుతుందని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందని, కానీ బీఆర్ఎస్ వ్యతిరేకించడంతో ఇప్పటిదాకా అక్కడ నుంచి ఒక ట్టటెడు బొగ్గు కూడా ఆ కంపెనీలు ఎత్తలేదని తెలిపారు. వేలంలో గనులను దక్కించుకున్న రెండు కంపెనీలు కేవలం బీఆర్ఎస్ పార్టీ సింగరేణి ప్రయోజనాల కోసం నిలబడడంతోనే మైనింగ్ ప్రారంభించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ.. గనులను కేటాయించినా, కేవలం రాష్ట్ర ప్రభుత్వ కఠిన వైఖరి, నిబద్ధత వల్లనే ఆ కంపెనీలు సింగరేణి బొగ్గును తవ్వలేకపోయాయని చెప్పారు. ఆ పూర్తి క్రెడిట్ బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. కానీ రేవంత్ పేర్కొన్న ఆ రెండు కంపెనీలు మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టాక్లి, జెన, బెల్లోర గనులను దక్కించుకున్న విషయం మర్చిపోవద్దని హితవు పలికారు. తెలంగాణ ప్రజల హక్కులను, ఆస్తులను, వనరులను తాకట్టు పెట్టడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నదీ జలాల వాటాను వదులుకున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారని చెప్పారు. తాజాగా బీజేపీకి అందిస్తున్న సహకారంతో సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేయాలన్న కుట్ర అందరికీ తెలిసిపోయిందని వెల్లడించారు. గనుల వేలంలో పాల్గొన్న మిమ్మల్ని, మీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని తెలంగాణ చరిత్ర క్షమించదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రానికి మీరు, మీ జాతీయ పార్టీలు చేస్తున్న ద్రోహానికి ప్రజలు సరైన సమయంలో ప్రజలు బలమైన గుణపాఠం చెప్తారని కేటీఆర్ అన్నారు.

## పేపర్ లీకేజీలకు ఇక కఠిన చర్యలు

**మొదటి పేజీ తరువాయి...**

కేంద్ర సిబ్బంది, వ్యవహారాలశాఖ ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా, పరీక్ష రాసే వారికి అనుచితంగా సాయం చేసినా, కంప్యూటర్ నెట్‌వర్క్‌ను ట్యాంపరింగ్ చేసినా, నకిలీ పరీక్షలు నిర్వహించినా, నకిలీ ప్రవేశపరీక్ష కార్డులు జారీ చేసినా నేరంగా పరిగణిస్తారు. పేపరు లీక్ చేసేవాళ్లకు 5 నుంచి 10 సంవత్సరాల వరకు జైలుశిక్షతోపాటు రూ.కోటి వరకు జరిమానా విధించే వెసుబాటు ఉంది. ఇందులో భాగస్వాములు వ్యవస్థీకృత నేరానికి పాల్పడినట్లు రుజువైతే.. వారి ఆస్తులనూ జప్తు చేస్తారు. పరీక్ష నిర్వహణకు అయిన ఖర్చునూ వారినుంచే వసూలు చేస్తారు. ఈ కొత్త చట్టం ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడినా, మాల్ ప్రాక్టీస్ చేసినా, నకిలీ వెబ్‌సైట్లు తెరిచినా గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, ఎన్‌డీఏ తదితర పోటీ పరీక్షలతో పాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి ఎంట్రన్స్ టెస్టులకు సైతం చట్టం వర్తించనుంది. పేపర్ లీక్ కేసుల్లో దోషులుగా తేలే వారికి కనీసం మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష పడుతుంది. అయితే పేపర్ లీక్ వ్యవహారాల్లో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన వారికి ఐదు నుంచి పదేళ్ల జైలుశిక్ష విధించాలని బిల్లులో పెట్టారు. విద్యార్థులు, ఉద్యోగార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడమే కాబట్టి.. ఇలాంటి నేరాలు చేసే వారికి భవిష్యత్ లేకుండా చేసేలా శిక్షలు ఉంటాయి. పరీక్షల నిర్వహణ బాధ్యతలను చేపట్టే సర్వీస్ ప్రొవైడర్ సంస్థలు పేపర్ లీక్ చేసినట్లు తేలితే వాటికి రూ.కోటి వరకు జరిమానా విధిస్తారు. పరీక్ష నిర్వహణకు అయిన ఖర్చునంతా సంస్థ నుంచి రికవర్ చేయాలనే ప్రతిపాదనను కూడా ఈ బిల్లులో పొందుపరిచారు. ఇలాంటి సంస్థపై పరీక్షలు నిర్వహించకుండా నాలుగేళ్ల పాటు బ్యాన్‌ను కూడా విధిస్తారు. పేపర్ లీక్ కేసుల విచారణను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లేదా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్థాయి కంటే తక్కువ లేని అధికారి నిర్వహించాల్సి ఉంటుంది. దర్యాప్తును ఏదైనా కేంద్ర ఏజెన్సీకి అప్పగించే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. ఈ బిల్లులో పేపర్ లీక్‌తో ముడిపడిన 20 రకాల నేరాలు, అక్రమాలకు పాల్పడే వారికి విధించాల్సిన శిక్షల గురించి ప్రస్తావించారు. మాస్ కాపీయింగ్, జవాబు పత్రాలను తారుమారు చేయడం, ఓఎంఆర్ షీట్లను ట్యాంపరింగ్ చేయడం వంటివన్నీ ఈ నేరాల జాబితాలో ఉన్నాయి.

## రెవరెండ్ చార్లెస్ బత్తులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

# కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు

బుద్వేల్, జూన్22(ప్రభాత ఉదయం) : శనివారం జన్మదిన వేడుకలు జరుపుకున్న రెవరెండ్ చార్లెస్ జాన్సన్ బత్తుల కు కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్నత చదువులు చదువుకున్న రెవరెండ్ చార్లెస్ జాన్సన్ బత్తుల విదేశాలలో యేసుప్రభు సేవ చేయడం సంతోషకరమన్నారు. ఆయన సేవా పరిచర్యలు దినదిన అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. చార్లెస్ బత్తుల కుటుంబ సభ్యులు సిస్టర్ మమత చార్లెస్, కూతురు నియోరా, కుమారుడు డేవిడ్ ఎలైజా లను దేవుడు ఆశీర్వదించాలని కోరారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో చార్లెస్ జాన్సన్ బత్తుల ల తల్లి సిస్టర్ షాలిని డేవిడ్ రాజు, సోదరి సిస్టర్ షారోన్ జ్యోతి, బావ బ్రదర్ సోలోమన్ రాజ్, అన్న , వదినలు బ్రదర్ పాల్ బత్తుల , సిస్టర్ కీర్తి బత్తుల, ఐవాన పాల్, సెలా పాల్, పెద్ద నాన్న బిషప్ పిల్లి పీటర్, పెద్దమ్మ సిస్టర్ పిల్లి భారతి తో పాటు వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.





రెవరెండ్ చార్లెస్ బత్తుల కుటుంబ సభ్యులు.. రెవరెండ్ చార్లెస్, సిస్టర్ మమత, నియోర, డేవిడ్ ఎలైజా లు..



రెవరెండ్ చార్లెస్ బత్తుల

**ప్రపంచ వ్యాప్తంగా వాడ బడాలి :**

రెవరెండ్ చార్లెస్ జాన్సన్ బత్తుల ప్రపంచవ్యాప్తంగా దేవుని సేవలో వాడబడాలని శ్రేయోభిలాషులు , సోదరులు అప్పారెడ్డి గూడెం భీమయ్య డానియెల్ కుటుంబ సభ్యులు ఎ. మాధవి, స్నేహ, శశాంక్ లు కోరారు. రెవరెండ్ జాన్సన్ బత్తుల నిస్వార్ధమైన దైవజనుడు అని రాజేంద్రనగర్ నియోజకవర్గం పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ కె నతానియల్ అన్నారు. జాన్సన్ మంచి స్నేహితుడని ఆయన స్నేహితులు కొనియాడారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో చేసుకోవాలని యేసయ్య ను ప్రార్థించారు.



పారిశుధ్య అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

# సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవితం

### కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

### వర్షాకాలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టండి

రాజేంద్రనగర్,జూన్ 22(ప్రభాత ఉదయం) సంపూర్ణ పారిశుధ్యంతోనే ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని అందుకోసం జిహెచ్ఎంసి పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్, కార్పొరేటర్ తో కల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో సానిటేషన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతుందని బీజేపీ రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని కాటేదాన్ పార్టీ కార్యాలయంలో జిహెచ్ఎంసి పారిశుధ్య విభాగం డీఈ శ్రీనివాస్,ఎస్ఎఫ్ఏ లు, సానిటేషన్ సిబ్బందితో ప్రత్యేక నిర్వహించి వర్షాకాలంలో ప్రత్యేక పార్టీధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...రాబోయేది వర్షాకాలం దృష్ట్యా పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటి రోడ్డు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు.విధి నిర్వహణలో అలసత్వం వహించకుండ సమయానికి తమ విధులకు హాజరై ప్రతి ఎస్ఎఫ్ఏ బస్తీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజలకు సమస్యలు తలెత్తితే సహించేది లేదన్నారు.ప్రజలు నడుస్తున్న రహదారులపై పేరుకుపోయి ఉన్న చెత్తా చెదరాలని ప్రజలకు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతీరోజు డివిజన్ పరిధిలో పారిశుధ్య చర్యలను పర్యవేక్షించాలని, అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ఎక్కడ కూడా చేత పేరుకుపోకుండా అన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.డివిజన్ పరిధిలోని చేత సేకరణకు కావాల్సిన చెత్త రిక్షాలను మరికొన్ని అందుబాటులోకి తీసుకువస్తానని కార్పొరేటర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ శానిటేషన్ డిపార్ట్మెంట్ డీఈ శ్రీనివాస్,శానిటేషన్ ఇన్స్పెక్టర్ సమేశ్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గౌడ్స్ డెంటల్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ

# దంత చికిత్సను అందించడంలో గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ సేవలు అభినందనీయం

### రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా

### వైద్యులు సామాజిక దృక్పథంతో పని చేయాలి

రాజేంద్రనగర్,జూన్ 22(ప్రభాత ఉదయం) అత్యాధునిక డెంటల్ కేర్ ప్రసిద్ధి చెందిన డాక్టర్స్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ సేవలను మరింత విస్తృత పరచడం సంతోషంగా ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ అన్నారు.ప్రజలకు నాణ్యమైన దంత చికిత్సను అందించడంలో గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ ముందుందని వ్యాఖ్యానించారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ ని మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాణ్యమైన దంత సంరక్షణ సేవలు ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ హాస్పిటల్ సుమారు 55 ఏళ్ల చరిత్ర ఉందని గుర్తు చేశారు.1967 నుంచి వారి సేవలు నిర్విరామంగా అందించడం అభినంద నీయమన్నారు.అనంతరం హాస్పిటల్ వ్యవస్థాపకులు,సీఎండీ ఎంఎస్ గౌడ్ మాట్లాడుతూ.. నగరంలో ఈ ఆసుపత్రి ఆరవదని వివరించారు. హైదరాబాద్ డిజిటల్ డెంటల్ ప్రాక్టీసులో ముందంజలో ఉన్నట్లు పేర్కొన్నారు.కోఠి, సికింద్రాబాద్,బంజారాహిల్స్,మాదాపూర్, గచ్చిబౌలీలో హాస్పిటల్స్ ఉన్నాయని వివరించారు. ఈ హాస్పిటల్ ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా సమకాలీన,అధునాతన దంత సంరక్షణ అందిస్తుందని తెలిపారు.అత్యంత అనుభవజ్ఞులైన దంత వైద్య నిపుణులను కలిగి ఉండటం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ చీఫ్ కాస్మెటిక్ డెంటల్ ఇంప్లాంటాలజిస్ట్, ఓరల్,మాక్సిల్లో ఫేషియల్ ప్రోస్టోడాంటిస్ట్ డైరెక్టర్ డాక్టర్ శంకర్,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

# పదేళ్ల నుండి పందికొక్కుల మెక్కిన వారు కాంగ్రెస్ పై విమర్శలా?

### ఫిష్ మార్కెట్లో బెస్త సోదరుల కడుపు కొడుతున్న బిఆర్ఎస్ చోటామోటా నాయకులు
### అంబేద్కర్ నగర్ వద్ద టిప్పర్ల దారుల వద్ద మామూలు వసూలు చేసేది మీరు కాదా?
### నర్సిరీలు నడుపుతున్న వారి వద్ద అక్రమ వసూలు చేసేది మీరేగా....
### బిఆర్ఎస్ ఎమ్మెల్యే 72 వేల మెజారిటీతో గెలిచింది అంటున్నారు...
### పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయి 32 వేలకు పరిమితం కాలేదా....
### భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ గెలుపే...
### కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు....

కూకట్‌పల్లి, జూన్ 22 (ప్రభాత ఉదయం) గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడి ప్రజల రక్తం పిలుస్తూ అక్రమ సంపాదనకు తెగబడ్డ బిఆర్ఎస్ నేత ల దగ్గర ఎంగిలి మెతుకులు తినేవాళ్లు కూడా కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి పై విమర్శిస్తారా అని కె పి హెచ్ బి డివిజన్ కాంగ్రెస్ నాయకులు నాగ మల్లేశ్వరరావు, అరవింద్ రెడ్డి, మేకల మైఖేల్ లు విమర్శించారు. గత పదేళ్లుగా టిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అక్రమ సంపాదనకు తెగబడి కోట్లాది రూపాయలు సంపాదించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ నెక్సస్ మాల్ సమీపంలో హౌసింగ్ బోర్డ్ స్థలం లీజుకు తీసుకొని సబ్ లీజుకు ఇచ్చింది మీరు కాదా అని ప్రశ్నించారు. బెస్త సోదరులకు సంబంధించిన ఫిష్ మార్కెట్లో బినామీ పేర్లతో స్టాల్స్ తీసుకొని వారి వద్ద అక్రమంగా వస్తువులు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. అంబేద్కర్ నగర్ వద్ద టిప్పర్ల వద్ద మామూళ్లు వసూలు చేస్తూ చివరకు రోడ్డు పక్కన నర్సరీలు పెట్టుకునే అమాయకుల వద్ద కూడా అక్రమవాసులు చేసింది టిఆర్ఎస్ నేతలు కాదని ప్రశ్నించారు. సమీక్ష పేరుతో తన క్యాంప్ ఆఫీస్ కు అధికారులను పిలిపించుకొని సమీక్ష చేసిన విషయంలో మా నాయకుడు శేరి సతీష్ రెడ్డి ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే దానిని తట్టుకోలేక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 72,000 మెజారిటీతో గెలుపొందారని దంబాచాట ప్రచారం చేస్తున్నారని అయితే పార్లమెంట్ ఎన్నికల్లో మీకు వచ్చిన ఓట్లు కేవలం 32 వేలు మాత్రమే కదా? కనీసం డిపాజిట్ కూడా రాలేదు కదా అని అన్నారు. భవిష్యత్తులో టిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం పై నాయకులపై విమర్శలు చేస్తే బిఆర్ఎస్ నాయకుల బినాముల అక్రమ దందాల వివరాలతో విలేకరుల సమావేశం పెడతామని హెచ్చరించారు.



హిమాయత్ సాగర్ బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని తాసిల్దార్ వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

# హిమాయత్ సాగర్‌ను పరిరక్షించండి

### జలాశయం చుట్టూ వెలుస్తున్న అక్రమ కట్టడాలను ఆడుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

శంషాబాద్. జూన్ 22( ప్రభాత ఉదయం) శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని కోత్వాల్ గూడ రెవిన్యూ గ్రామం లో హిమాయత్ సాగర్ జలాశయం పక్కన విచ్చల విడిగా సాగుతున్న అక్రమ కట్టడాలను అరికట్టాలని శంషాబాద్ తహసిల్దార్ తోపాటు శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు నసీరుద్దీన్. గుంటి ప్రవీణ్ కుమార్ తదితరులు శనివారం శంషాబాద్ తాసిల్దార్ నాగమణి. మున్సిపల్ కమిషనర్ సుమన్ రావుకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 54 లో హిమాయత్ సాగర్ జలాశయానికి అనుకొని ఉన్న ప్రాంతంలో గత కొన్ని నెలలుగా విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవిన్యూ అధికారులు కానీ. మున్సిపల్ అధికారులు కానీ. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఆడింది ఆటపాడింది పాటగా సాగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా హిమాయత్ సాగర్ జలాశయం చుట్టూ వేలాది లారీలతో మట్టి పోసి పూడ్చి వేస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తగిన నిర్ణయం తీసుకొని పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తామని హెచ్చరించారు.



బఫర్ జోన్ లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మీసాల లక్ష్మీ నివాస్

# బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించాలి: మీసాల లక్ష్మీ నివాస్

బుద్వేల్, జూన్22(ప్రభాత ఉదయం): రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ ఓ) రాష్ట్ర అధ్యక్షులు మీసాల అన్నారు. శనివారం ఆయన బుద్వేల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.అక్కడ విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లలో వసతులను కల్పించాలని కోరారు. మధ్యాహ్నం భోజనంలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. బుద్వేల్ లో 480 మంది విద్యార్థులు ఉన్న సరిపడ తరగతి గదులు లేక పాఠశాల ఆవరణలో చెట్ల కింద విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. త్రాగునీరు సమస్య, మూత్రశాలలకు తలుపులు లేక విద్యార్థిని విద్యార్థులు అనేకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎస్ ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, రాష్ట్ర నాయకులు సుదర్శన్ టీఎస్ ఎస్ ఓ రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




కాటేదాన్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

## బొగ్గు బ్లాకులు నేరుగా

# సింగరేణికే కేటాయించాలి

బుద్వేల్, జూన్22(ప్రభాత ఉదయం):సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని సీఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ అన్నారు. సీఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కాటేదాన్ చౌరస్తా లో సింగరేణి వేలాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తు, ప్ల కార్డులు పట్టుకుని రాస్తా రోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీ.ఐ.టి.యు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ మాట్లాడుతూ దేశానికి మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థను దివాళా తీయించే విధంగా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం పాట ప్రారంభించిందన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉన్న జి. కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోనే ఈ ప్రక్రియ ప్రారంభించటం ఆందోళనకరం అన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొనటం ఆశ్చర్యకరం అన్నారు. ఒకవైపు బొగ్గు బ్లాకును వేలం వేస్తూ, మరొకవైపు సింగరేణిని ప్రైవేటీకరించబోము అని మంత్రి కిషన్‌రెడ్డి బుకాయిస్తున్నారన్నారు. ఇది ఓట్లు వేసి గెలిపించిన తెలంగాణ ప్రజలను మోసం చేయటమే అన్నారు. తక్షణం వేలంపాట రద్దు చేయాలనీ, రాష్ట్రంలో బొగ్గు తవ్వే సంస్థగా సింగరేణికే బొగ్గు బ్లాకులు అప్పగించాలనీ సీఐటీయూ జిల్లా కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ పాలనలో రెండు ప్రైవేటు సంస్థలకు కేంద్రం కట్టబెట్టిన రెండు బొగ్గు బ్లాకులు కూడా తిరిగి సింగరేణికే అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి కవిత, జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్, సాయిబాబా, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ రామ్మోహన్ రావు, అలీ దేవేందర్, స్వప్న, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జి కురుమయ్య , ఎస్ వీరయ్య , జె పెంటయ్య, బుట్టి బాలరాజు, నరసింహ, బుగ్గ రాములు, ఎల్లేశ్, స్థానిక కాటేదాన్ క్లస్టర్ నాయకులు వెంకటేష్ గౌడ్, బాలరాజ్, జహంగీర్, సచిన్, ప్రవీణ్, శశికాంత్ తో పాటు కార్మికులు పాల్గొనడం జరిగింది



చింతల్ మెట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కు నోటు పుస్తకాలు, యూనిఫార్మ్ లను అందచేస్తున్న నవాజుద్దీన్, తదితరులు

# విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫారంలు అందజేసిన మజ్లీస్ నాయకుడు నవాజుద్దీన్

బుద్వేల్, జూన్22(ప్రభాత ఉదయం) : సులేమాన్ నగర్ డివిజన్ చింతల్ మెట్ లో గల తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలలో శనివారం చిన్నారులకు మజ్లీస్ నాయకుడు నవాజుద్దీన్ నోటు పుస్తకాలు , పాఠ్యపుస్తకాలతో పాటు స్కూల్ డ్రెస్ లు పంపిణీ చేశారు. చిన్నారులు బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాహెర్, మతిన్, మోసీన్ లు పాల్గొన్నారు.

# రెండు సంవత్సరాల ఉద్యాన డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

రాజేంద్రనగర్, జూన్22(ప్రభాత ఉదయం): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం లో రెండు సంవత్సరాల ఉద్యాన డిప్లొమా కొరకు నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు సంవత్సరాల వ్యవధి గల ఉద్యాన డిప్లొమాలో మొత్తం 200 సీట్లు ఉంటే, ఉద్యాన విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్ లు ఆదిలాబాద్, రామగిరికిల్లా, కొల్లాపూర్ పాలిటెక్నిక్ ఉద్యాన కళాశాలలలో 40 చొప్పున ఇంటెక్ కెపాసిటీ ఉంది. మరో రెండు అఫీలేటెడ్ పాలిటెక్నిక్ లు కూడా అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. సూర్యపేట లోని గడ్డిపల్లి లో గల గంటా గోపాల రెడ్డి ఉద్యాన పాలిటెక్నిక్, మహబూబాబాద్ లోని తొర్రూర్ లో గల విశ్వదార హార్టికల్చర్ పాలిటెక్నిక్ ల్లో కూడా 40 చొప్పున సీట్లు ఉన్నాయి. ఇప్పటికే అప్లికేషన్లు తీసుకుంటుంది. ఈ నెల 15 నుంచి మొదలైన అప్లికేషన్లు జూలై 15 వరకు స్వీకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలీసెట్ 2024 లేదా పదో తరగతి ఉత్తీర్ణులు అయిన వాళ్ళు లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు డిప్లొమాకు దరఖాస్తు చేసుకోవచ్చు. పాలీసెట్-2024 ర్యాంకు లేదా సమానమైన పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా విద్యార్థుల అడ్మిషన్లు ఉంటాయి. 2024 డిసెంబర్ 31 నాటికి కనీసం 15 సంవత్సరాలు, గరిష్టంగా 22 సంవత్సరాల వయసు కలిగి ఉండాలి. 60 శాతం సీట్లు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం నాలుగు సంవత్సరాలు చదివిన విద్యార్థులకు కేటాయిస్తారు. అన్ని కళాశాలలో హాస్టల్ వసతి ఉంది.

**మోజెర్ల ఉద్యాన కళాశాలలో ఉద్యాన డిప్లమా : డాక్టర్ పిడిగెమ్ సైదయ్య**

వనపర్తి జిల్లా మోజెర్లలోని ఉద్యాన కళాశాల ప్రాంగణంలో కొల్లాపూర్ ఉద్యాన పాలిటెక్నిక్ ఉన్నది. ఇక్కడ విద్యార్థిని, విద్యార్థులకు కావాల్సిన బోధన, బోధనేతర సిబ్బందితో పాటు హాస్టల్ వసతి, ప్రయోగశాలలు, తోటల విస్తీర్ణం ఉన్నది. ఉమ్మడి మహబూబ్ న గర్ జిల్లా లోని ముఖ్యంగా వనపర్తి, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాల విద్యార్థులకు ఇక్కడి ప్రాంగణం దగ్గరగా ఉంది. కాబట్టి ఇక్కడ అడ్మిషన్లు తీసుకుంటే వాళ్లకు అన్ని విధాల మేలుగా ఉంటుందని పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని పేర్కొన్నారు. ఉద్యాన పంటల విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యం, ఉద్యాన ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో, భవిష్యత్తులో శిక్షణ పొందిన ఉద్యాన మానవ వనరులకు మేలైన ఉపాధి అవకాశాలు ఉంటాయి. ప్రత్యేకించి గ్రామీణ యువత ఉద్యాన డిప్లమా పూర్తి చేసినట్లయితే ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. నర్సరీ మొదలుకొని చీడపీడల యాజమాన్యం, ఉద్యాన పంటల శాస్త్రీయ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలలో మెలకువలు అలాగే పంట కోత అనంతరం విలువల జోడింపు వంటి అంశాలపై విద్యార్థులకు డిప్లమా లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వబడుతుంది. రెండు సంవత్సరాల ఉద్యాన డిప్లమా పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యాన పరిశ్రమలు, ఆయిల్ ఫామ్ పరిశ్రమలు తోపాటు అనేక విభాగాలలో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. నేరుగా బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో హార్టి సెట్ ద్వారా సీటు సంపాదించవచ్చు. విత్తన, పురుగుమందులు, ఎరువుల కంపెనీల్లో అనేక అవకాశాలు ఉన్నాయి.

**మరిన్ని వివరాలకు :**

అడ్మిషన్ కు సంబంధించి మరిన్ని వివరాల కోసం హెల్ప్ డెస్క్ నెంబర్లు: 9652456779 ను సంప్రదించవచ్చు. ములుగు లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ను సంప్రదించవచ్చు.

# రైతులందరూ సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని ఎడ్ల బండి పై ఊరేగింపు తో స్వాగతం పలుకుతున్న రైతు సోదరులు



ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్22(ప్రభాత ఉదయం) రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది.. దేశానికి వెన్నెముక అయిన రైతులు ఎల్లప్పుడూ బాగుండాలని తెలంగాణ రాజ్యసభ సభ్యుడు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర , గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శనివారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా కేంద్రంలో మున్నూరుకాపు ఆధ్వర్యంలో నిర్వహించిన ముంగారు సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిలుగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,రాయచూరు ఎంపీ జి. కుమార్ నాయక్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాయచూరు పట్టణంలోని మార్కెట్ యార్డు లో నిర్వహించిన వృషభరాజుల పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో రైతులు ఆనందంగా, సంతోషంగా ఉంటేనే దేశం బాగుంటుందన్నారు. ఆధునిక కాలంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు సంబురాలు చేసుకోవడం అభినందనీయమన్నారు. రైతులు చల్లగా ఉంటేనే రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని, రైతు సంక్షేమం ప్రభుత్వాలు పాటుపడాలన్నారు. వర్షాలు పుష్కలంగా పడి పంటలు సుభిక్షంగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు సమాజ అభివృద్ధి కోసం నా వంతుగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తాననీ గద్వాల ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయచూరు ఎంపీ జి. కుమార్ నాయక్, రాయచూరు మాజీ ఎమ్మెల్యే పాపిరెడ్డి, మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ కుమార్ మున్నూరు కాపు సంఘం నాయకులు బెల్లం నర్సిరెడ్డి, కేటిదొడ్డి జెడ్పీటీసీ రాజశేఖర్ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జి.వేణుగోపాల్, శ్రీనివాస్ రెడ్డి, హనుమంతు, ప్రభాకర్ గౌడ్, శ్రీరాములు, కేశవ్ రెడ్డి , చంద్రశేఖర్, కురుమన్న, ఉరుకుంద, మున్నూరు కాపు సంఘం నాయకులు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ముంగారు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపిరెడ్డి

# ప్రతి పిర్యాదు పట్ల స్పందిస్తాం

### ప్రజలకు 24 గంటలు అందుబాటులో పోలీస్: ఎస్ పి తోట శ్రీనివాస రావు

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### దొంగతనాల నిరోధానికి పూర్తిస్థాయిలో నిఘా

### విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల ఎస్ పి శ్రీనివాసరావు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 22(ప్రభాత ఉదయం)జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత ప్రధాన లక్ష్యంగా పని చేస్తామని జిల్లా ఎస్పి తోట శ్రీనివాస రావు అన్నారు. జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఎస్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ... జిల్లా పరిధిలోని సామ్యాసుడిని దృష్టిలో పెట్టికోని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ వుంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, విద్వేషాలను రెచ్చగోట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాము అని అన్నారు. మహిళలు రక్షణ కోసం, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతామని, అలగే దొంగతనాల నిరోధానికి మరిన్ని సి సి కెమేరాలు ఏర్పాటు చేయించడం తో పాటు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందుకు ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. జిల్లా లో రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చొరవ తీసుకుంటానని అన్నారు. చెడు పనులను ఎవరు ప్రోత్సహించిన ఉపేక్షించేది లేదని ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు.

# పందెం వాగు నాలాపై పూర్తి స్థాయిలో బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలి

### ది సిటిజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ రావు



ఫిర్యాదు చేస్తున్న సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు

నార్సింగి,జూన్ 22(ప్రభాత ఉదయం): మణికొండ పురజనులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ది సిటిజన్స్ కౌన్సిల్ తన వంతు ప్రయత్నంలో పందెం వాగు నాలాపై పూర్తి స్థాయిలో బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాం పర్యవేక్షిస్తున్న చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావుని కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం పంచవటి కాలనీ దగ్గర బుల్కాపూర్,మల్కం చెరువుల ద్వారా వచ్చిన మురుగునీరు షేక్పేట్ నాలాలోకి తరలించ వలసి ఉండగా అప్పట్లో డిజైన్ తప్పిదం వల్ల మొత్తం మురుగు నీరు పందెం వాగులోకి మళ్లించడం కారణంగా గడచిన పది 12 సంవత్సరాలకు పైగా పందెం వాగు చుట్టుపక్కల వేలమంది జనాలకు తీవ్ర దుర్గంధం వెధ జల్లడం వలన అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. వర్షాకాల సమయంలో పలుచోట్ల పందెం వాగు పొంగి పొర్లి వరదలుగా తలపిస్తూ కాలనీలకు కాలనీలను ముంచెత్తడం ప్రతి ఒక్కరూ గమనిస్తున్న విషయమే. వరద నివారణ చర్యల్లో భాగంగా పంచవటి కాలనీ నుండి ట్రైల్స్ గేటెడ్ కమ్యూనిటీ వరకు ప్రస్తుతం బాక్స్ డ్రైన్ నిర్మాణం జరుగుతున్నది. ఈ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి ట్రాఫిక్ కి వెసులుబాటు కల్పించాలన్నారు. ఈ నిర్మాణాన్ని నేక్నాంపూర్ వరకు పొడిగించని కోరారు. రాబోవు కాలంలో దాదాపు 40 పై చిలుకు బహుళ అంతస్తు సముదాయాలు రానున్న కారణంగా మణికొండ పురపాలక సంఘం పరిధిలో మురుగు నీరుపారుటకు ఏకైక నాలా అయినటువంటి పందెం వాగును ఆధునీకరించి వాడుకలోకి తీసుకురావాలన్నారు. మణికొండ పురజనుల ప్రధాన సమస్యను జిహెచ్ఎంసి చీఫ్ ఇంజనీర్ సానుకూలంగా స్పందించి ఈ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. అటులనే ది సిటిజన్స్ కౌన్సిల్ వినతి మేరకు నెక్నాంపూర్ స్పెక్ట్రమ్ విల్లాస్ దగ్గర ప్రస్తుతమున్నలో లెవెల్ బ్రిడ్జి ప్రాంతంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పట్ల మణికొండ పురపాలక సంఘం సానుకూలంగా స్పందించినందుకు ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నాము. నీటి ప్రవాహానికి ఇబ్బంది రాకుండా పూర్తిస్థాయి కాంక్రీట్ బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ది సిటిజన్స్ కౌన్సిల్ తరపున ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ రావు కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్,ఉప కార్యదర్శి ఉపేందర్నాథ్ రెడ్డిలు వినతి పత్రం సమర్పించడం జరిగింది అని కౌన్సిల్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ సూచించారు.



బస్తీలలో పర్యటిస్తున్న కార్పొరేటర్

# త్రాగునీటి సరఫరాలో కలుషిత నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా

### కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, జూన్ 22 (ప్రభాత ఉదయం) త్రాగునీటి సరఫరా లో పరిస్థితి నీటి సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి సర్కిల్ మూసాపేట ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీ జాన్సన్ గ్రామర్ స్కూల్ వీధిలో గత వారం రోజులుగా తాగునీటిలో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికు మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ జలమండలి మేనేజర్ అనిల్ కుమార్ తో కలిసి ఆయా ప్రాంతంలో కలుషిత నీటి సరఫరాను పరిశీలించారు. డివిజన్ లోని నేతాజీ కాలనీలోని సమీప స్థానిక ప్రజలకు కలుషిత నీటి సరఫరా వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ మేరకు ఆయా పరిసర ప్రాంత వాసులను అడిగి తెలుసుకోగా గత వారం రోజులుగా తాగునీటిలో కలుషిత నీరు వస్తుందని, దీంతో కలుషితనీటికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక మహిళలు కోరారు. అందుకు నాలుగైదు రోజుల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతాజీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట రాంనర్సయ్య, స్వామి, శేఖర్ గట్ల, సురేందర్ నాయుడు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

### కూకట్‌పల్లి నియోజకవర్గంలో

# అంతులేని అక్రమ నిర్మాణాలు

### అక్రమ నిర్మాణాల వల్ల డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి...

### టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు

### అధికారుల నిర్లక్ష్యంపై ఇంచార్జ్ జోనల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేసిన జిట్టా సునీల్ కుమార్ యాదవ్



అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకుడు జిట్టా సునీల్ కుమార్

కూకట్‌పల్లి, జూన్ 22 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి ఇంచార్జ్ జోనల్ కమిషనర్ కి కూకట్ పల్లి యువజన కాంగ్రెస్ నాయకుడు జిట్ట సునీల్ కుమార్ యాదవ్ కుకట్ పల్లి మూసాపేట్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిట్ట సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కూకట్ పల్లి మున్సిపాలిటీ ఆఫీసులోని టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కూకట్ పల్లి నియోజకవర్గం లో డ్రైనేజ్ సమస్యలు, ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. వీటన్నిటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఈ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. పరిమితి మించి భవన నిర్మాణాలు చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం వలన సమస్య తలెత్తిందని అన్నారు. 100 నుంచి 300 గజాలలో పరిమితికి మించి అంతస్తులు నిర్మిస్తున్న అందులో కనీసం పార్కింగ్ లేకున్నా 5,6 అంతస్తులు నిర్మిస్తున్నారు అంటే అది ఎవరి ధైర్యం అని అన్నారు. ఇలా నిర్లక్ష్యం చేయడం వలన ప్రతి సంవత్సరం వర్షాకాలంలో డ్రైనేజ్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, అదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇన్చార్జ్ జూనియర్ కమిషనర్ ని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి 18వ వార్షికోత్సవ వేడుకలు

### ప్రత్యేక పూజ నిర్వహించిన బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు.



కూకట్‌పల్లి, జూన్ 22 (ప్రభాత ఉదయం) ఏ వి బి పురం లోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ భ్రమరాబిక సహిత మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ శ్రీ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులు ఏ వు బి పురం వాసులకు ఉండాలని అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారా సింగ్, వాసు, రమణారావు, మేకల రమేష్, రఘూవయ్య, వెంకట్ రావు, కిరణ్, పాపారావు, మేఘనాత్ పాల్గొన్నారు.



కురుమూర్తి స్వామి ని దర్శించుకున్న మాజీ పటేల్ వెంగల్ రెడ్డి కుటుంబ సభ్యులు

# కురుమూర్తి రాయుడిని దర్శించుకున్న పటేల్ వెంగల్ రెడ్డి కుటుంబం

కొత్తకోట, జూన్ 22(ప్రభాత ఉదయం) ఏరువాక పౌర్ణమి సందర్భంగా రామకృష్ణాపూర్ కు చెందిన పటేల్ వెంగళ్ రెడ్డి కుటుంబ సభ్యులు కురుమూర్తి రాయుడిని దర్శించుకున్నారు. మాజీ మార్కెట్ ఛైర్మెన్ భీం రెడ్డి ఈ పర్వదినం సందర్భంగా మెట్టు మెట్టుకు టెంకాయను కొడుతూ కొండపైకి వెళ్ళారు. కుటుంబ సభ్యులు మూలమల్ల సత్యనారాయణ రెడ్డి, రఘునాథ రెడ్డి, యుగంధర్ రెడ్డి, శశికళ, లోకనాథ్ రెడ్డి, చక్రవర్ధన్ రెడ్డి, విక్రమ్ సింహా రెడ్డి, రాజేష్ రెడ్డి తో పాటు రామకృష్ణపురం మాజీ సర్పంచ్ బుచ్చన్న, కృష్ణయ్య, మోగులన్న ఉన్నారు.



దత్త రామలింగేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న భక్తులు

# శ్రీకోటిలింగేశ్వరదత్త ఆలయంలో ఘనంగా నాలుగో రోజు బ్రహ్మోత్సవ వేడుకలు

కొత్తకోట, జూన్ 22(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానము సప్తమాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో శనివారం ( 4 రోజు )చివరి రోజు ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాలతో అర్చకుల వేదమంత్రాల మధ్య అశేష భక్త జన సందోహం తిలకిస్తుండగా వైభవోపేతంగా కళ్యాణం జరిగింది. అనంతరం ఆలయకమిటి భక్తులకు అన్నదానం చేశారు.

# రెండు లక్షల రుణమాఫీపై రైతుల హర్షం



రైతు రుణమాఫీ ని ప్రభుత్వం ప్రకటించటంతో సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

కొత్తకోట, జూన్ 22(ప్రభాత ఉదయం) తెలంగాణ రైతాగాన్నికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏరువాక పూర్ణం రోజు ఆరుద్ర కార్తినాడు పొలం దున్నడానికి శుభ ప్రదమైన రోజు ఏకకాలంలో రైతు రుణాలను ఒకేదఫాలో మాఫీ చేయాలని నిర్ణయించడంపై సన్న చిన్నకారి రైతులకు ప్రాణం పోశాడని కొత్తకోటలో శనివారం రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హర్షం వ్యక్తం చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు తీసుకున్న రూ.2 లక్షల లోపు రుణాలన్నీ ఒకే విడతలో మాఫీ చేసేందుకు భరాస ఇచ్చి ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీని ఏకకాలంలో చేస్తుండడంతో ఇచ్చిన హామీని ముందే నిలబెట్టుకుంటు అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ పథకాన్ని వర్తింప చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాము. రైతు సంక్షేమం కోసం 31 వేల కోట్ల రూపాయలతో రుణమాఫీ ప్రకటించడం చాలా సంతోషకరమైన విషయం గత ప్రభుత్వం పదేండ్లలో రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎనిమిది నెలల్లోనే రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుంది విడతల వారి ప్రక్రియకు స్వస్తి పలికి ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేయడంతో రైతు సంక్షేమ రాజ్యం అని రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి, రైతు సంక్షేమంతో పాటుగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం కృషి చేయడం స్వయంగా రైతుబిడ్డ కాబట్టి రైతుల కష్టసుఖాలు బాగా తెలుసు అందుకే రేవంత్ రెడ్డి రైతాంగానికి చేస్తున్న మంచి కార్యక్రమాలకు రైతులందరూ అండగా ఉండాలని రైతులను కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో కొట్టం దామోదర్ రెడ్డి, పి కొండారెడ్డి, వేముల గోపాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, బాలరాజు యాదవ్, బజార్ అన్న, బుచ్చన్న, చిన్నయ్య, రాములు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.